


# రాఖీబంధితులు

పి.వి.యస్. అచ్యుతవల్లి

పందిట్లో పెళ్ళయిపోతోంది. పెళ్ళి అంటే అల్లాంటి ఇల్లాంటి పెళ్ళి కాదు. ఆకాశంకనపడనేయంతపందిరి. భూదేవి నిండినపీటలు! ఫెళ్ళు ఫెళ్ళు మంటూ బాణా సంచాల శబ్దాలు! ఝుంయ్ ఝుంయ్ తారాజువ్వల వెలుగులరవ్వలు! 'మాంగల్యంతంతునానేన మమ జీవన హేతునా. కంఠేబద్నామి సుభగే జీవంతు. శరదాశ్శతమ్‌!' పురోహితుడి కంఠం స్పష్టంగా వినపడుతోంది.

కన్నెల శరీరాలు వెన్నెలలో తడుస్తున్న అనుభూతితో జల్లు జల్లు మంటున్నాయి. వరుడు అలవోకగా నవ్వుతూ వధువు మెడలో మూడు ముళ్ళు వేయటం, ఫ్లాష్ కెమెరాలు క్లిక్ క్లిక్ మనటం అన్నీ సవ్యంగా జరాగిపోతున్నాయి. ఉదయం తొమ్మిదింటికి వచ్చేడు కేశవ్. రాత్రి ఒంటిగంట దాటుతోంది. తను ఈ పెళ్ళికి పది వేలు ఖర్చు పెట్టుకుని ఆఘమేఘాల మీద రెక్కలు విప్పుకున్నట్లు వచ్చేడు అమెరికానించి, 'రాజీ కోసం!' జారిపోతున్న జ్ఞాపికలని మనస్సు మందిరంలో తిరిగి ఒక్కసారి బంధించుకోవటం కోసరం! పదిహేనేళ్ళ క్రితమే అమెరికా పౌరసత్వం తీసుకున్నాడు! రాజీ ఎక్కడుంటే అక్కడే తచ్చాడుతున్నాడు. మాటలు కలుపుతున్నాడు. వేళాకోళాలు ఆడుతున్నాడు. కాంత ఏకాంతానికి కాతరపడటం లేదు. అందరూ పెళ్ళి పందిట్లో హడావిడి పడిపోతున్నారు. ఈ సమయం మించకూడదు. జాజులుమరువాలు కనకాంబరాలు కట్టిన కదంబమాల రాజీ మెడ మీద చిన్నగా స్పృశించినట్టయింది. ఉద్వేగంతో వున్న రాజీ వెనుతిరిగి చూసింది. పందిరిచాటునించి విన్నపాలు నిండిన కళ్ళు! ఆర్తి చూపిన చేతులు! రాజీ కాటుకకళ్ళు తళుక్కుమన్నాయి! ఆమె మనస్సు తబ్బిబ్బులయింది! ముక్కునున్న

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

రవ్వల ముక్కు పుడక మిటుక్కు మిటుక్కు మంటూ మెరిసింది. వెండి వెన్నెల నీడల జాడలు పరిచిన పారిజాతాల, మల్లె పొదల నీడన కూర్చున్నారు. ఎందుకనో ఫకాలుమని నవ్వింది రాజి అను రాజ్యలక్ష్మి.

"ఎందుకా నవ్వు రాజీ!" అంటూ ముడి వెచ్చగానున్న ఆవిడ చేతులు తన చేతుల కానించు కున్నాడు కేశవ్.

"ఇన్నాళ్ళకి మళ్ళీ ఇల్లాగ, మనం ఇద్దరం మళ్ళీ ఇల్లాగ! గమ్మత్తుగా వుంది కదూ!" అంది రాజ్యలక్ష్మి. 'రాజీ' అనేపిలుపు కేశవ్‌కే హక్కు! ఇంకెవరు అల్లా పిలిచినా తోక తొక్కిన త్రాచు అవుతుంది రాజ్యలక్ష్మి.

"ఆ తోట ఆ తోపు ఆకుపచ్చని గుబురు. ఆ వంక గొర వంక అన్నివున్నాయిలే!" అన్నాడు కేశవ్. చిరునవ్వుల పెదాల చివర్నించి జారిన వెలుగు వెన్నెల ముత్యాలు! బుగ్గలలో హత్తుకు పోయిన కెంపుల మంకెన పూలు! కళ్ళల్లో హిమ తుషార బిందువులు!

"రాజి! రాజి! ఎన్నాళ్ళ కెన్నేళ్ళకి! మళ్ళీ మనం ఇల్లాగ! నువ్వు నమ్ముతావా నీకోసరమే నేను వచ్చేనంటే!"

"కేశవాయ నమః మాధవాయ నమః అంటూ రోజూ నిన్నుపూజలో తల్చుకుంటూనే వున్నాను కేశవ్! ఈమసక చీకటిలో మల్లెతోట వెనకాతల నా మనసయినది ఎప్పటికీ దొరకదు అని తెలుసుండీ, నీ తలపులు నా మనస్సుని సంపెంగ పొదని చుట్టుకున్న జాతి రకం శ్వేత. పన్నగాల్లా చుట్టుకుంటాయి!"

"రాజీ! అల్లా అనకు. నాగరికత మితిమీరిన ఈనాటి సమాజంలో నిన్ను నా స్వంతం అని ప్రకటించబుద్ధి పుట్టుతోంది. ఇన్నేళ్ళ నా ఊహ లలో నీవే నా తోడుగా ఉయ్యాలలూగావు. నీ సిరిగల ముఖం, మడతలుపడే చెంపలు, నవ్వుని దాచుకునే పెదాలు నా మనో యవనిక మీద ఎప్పుడు కావాలంటే అప్పుడే ప్రదర్శించుకో గలిగే శక్తి వుంది నాకు! వెచ్చని చేతులతో కళ్ళు మూసి మల్లెపూల మృదుత్వంతో మెడ మీద ముద్దులు అద్దే రాజి అనుభవం నన్నెప్పుడూ వద దు" అన్నాడు కేశవ.

"పప్పులో ఉప్పు ఎక్కువయినా, అరటికాయ పుదు మాడినా ఇంతెత్తున ఎగిరిపడతారు మా వారు. నీ జ్ఞాపకాలు మూటలోంచి విడుతాయి. చేతిలో ఉప్పు చక్కెర అయింది రాజి! అరటి ముల కి విరహాగ్ని ఎక్కువయిపోయి మాడి మసి అయినాయి! నీ మనస్సుకి ఆ విరహాగ్ని మధుకీలలు సోకనీకు' అంటావు అని నాకు తెలుసును!'ఆ కళ్ళేమిటి పత్తికాయల్లా చేసుకుని నిలబడతావు! కూర మాడిందంటే కూడ తప్పేనా! నీకే వున్నాయా, చెంపకు చారెడు కళ్ళు – అమ్మవారికి మల్లె!' అంటూ ఇంకా విసుగు! నీవయితే, 'మాట్లాడలేని మల్లెపూవా! నిశ్శబ్దంగా నడిచిరావ! ముక్కలన్నీ మాడు ఎట్లా బిక్క ముఖాలేసినాయో!' అంటూ నవ్వి స్తావనే ఊహ ఇన్నీ రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు ఇంతటి పెద్ద సంసార భారాన్ని అవలీలగా ఆదిశేషుడు భూభారాన్ని మోసినట్టు గా మోయగలిగినట్లు చేయగల్గుతోంది కేశవ్!" అంది రాజ్యలక్ష్మి. "రాజి! జీవితంలో ఒక ఉన్నత మయిన స్థానం కోసం రాజీ పడ్డాను. అది కల్పించినందుకు నా భార్యను కృతజ్ఞతగా చూసేను. కుటుంబం కృతజ్ఞతతో పెరిగింది. నీవు చిన్నప్పుడు దేముడిచుట్టూ ప్రదక్షిణ చేసి వస్తే, నేను నీచుట్టు ప్రదక్షిణ చేసేవాడిని. నీకు వేరే దేముడుండేవాడు. నాకు మటుకు భక్తి ప్రదర్శించేందుకు నువ్వే దేవతవి అయినావు! 'మీలో మీరే మాట్లాడుకుంటారేమిటి, పిచ్చా మీకు!' అంటూ నా భార్య విసుగుకుంటూ వుంటుంది. 'శ్వేత వెన్నముద్ద చెంగల్వపూదండ పద్యం జ్ఞాపకం చేసుకుంటున్నాను' అంటాను. 'ఇంకా తెలుగు పిచ్చి వదలలేదా మీకు! నక్క నాగ లోకంచూసినా కుక్కలమొరుగులేవినబడతాయి దానికి!' మూతివిరుస్తుంది.'నువ్వు ఈసొసైటీలో హైలీ క్వాలిఫయిడ్, సోఫిస్టికేటెడ్ లేడీవి. కాని. నాముందర మటుకే నీ మూతి విరుపులు, ముక్కు ఎరుపులతో నూరుపైసల తెలుగుభార్య అవతారం ప్రదర్శితమవుతుంది. ఆ తెలుగు తనంకోసమే ఇల్లాగటుమీలు వేస్తూవుంటాను' అంటాను.

"చాలు లెండి సంబరం అంటుంది" అన్నాడు కేశవ్.

"నాకెంత సంతోషంగా తృప్తిగా వుందో చెప్పలేను కేశవ్! పాతిక సంవత్సరాల నాటి మన అనురాగం ఇంకా ఆరని దివ్వెలా మన మనసుల్లో వెలుగుతూంది. నా కూతురి కూతురు నీ కొడుకు కొడుకూ ప్రేమించుకున్నారని తెలిసి వాళ్ళ వివాహానికి ఎంతో తొందరచేసేను. వాళ్ళు మనలా కాకూడదనీ వాళ్ల ప్రేమ పండాలనీ ఎందరో దేముళ్లకి మొక్కుకున్నాను."

"ప్రేమకి పెళ్లికీసంబంధంలేదు రాజీ. ప్రేమ హృదయాలని కట్టివేస్తుంది. పెళ్లి శరీరక అవసరాలకి లైసెన్స్ ఇస్తుంది. మనం దంపతుల మయితే ఇన్ని సంవత్సరాలు ఈ జ్ఞాపకాల తీయ దనం మిగిలుండేదికాదు. సంసార చక్ర బంధం లో ఇరుక్కుపోయి అప్పులు, ఆస్తులు బేరీజు వేసుకుంటూండటంలో మునిగి తేలుతూ వుండే వాళ్ళము. ఇప్పుడు ఆ పెళ్ళి పీటల మీద వున్న నూతన వధూవరులకన్నా మిన్నగా మానసికంగా ఎంతో హాయి అయిన, తీయనైన ఈ అనుభూతి పల్చని గంధపు పరిమళంలా మనలని ఆవరించేది కాదేమో అనిపించుతూంది!"

"నిజమే కేశవ్! ఇన్నాళ్ళ జీవితం ఒక కల, ఈ క్షణమే నేను జీవించుతున్నాను అన్పించు తూంది ఈ స్మృతి మాధుర్యంతో. సంజెపడిన బ్రతుకు వెన్నెల రేయితో నిర్గమిస్తుంది. చాలా తృప్తిగా హాయిగా వుంది కేశవ్!" అంది రాజ్య లక్ష్మి.

"మనస్సులలో మల్లెల మాలలు, కన్నులలో వెన్నెల డోలలు....కవిగారి హృదయరమ్యత మన లాంటి జంటలనెందరినో భావ బంధంతో కట్టి పడేస్తూంది రాజీ. జీవితంరసహీనంఅయినప్పుడు ఈ మధుర భావనలే ఆకాశంలో వెలుగుచుక్క లని తాకేట్లు చేయగలవు! ఈ క్షణం నాకు అమూల్యమైనది. ఏటిలోని కెరటాలు ఏరు విడచిపోవు అన్నట్లు మనమనస్సుల్లోనిమమతలు ఎన్నాళ్ళకీ ఎండిపోవు!" అన్నాడు కేశవ్ రాజీ చెంపలు నిమురుతూ! వరుడికి తాతయ్య కేశవ్! వధువుకి అమ్మమ్మ రాజ్యలక్ష్మి! ఆ స్పర్శకి పులకించింది రాజ్యలక్ష్మి. చల్లనిపిల్లగాలి తిరిగింది. పారిజాతం జలజల్లా డింది. ఇద్దరి తలల్నిండా పరిమళ పారి జాతాలు రాలాయి. పందిట్లో వధువు వరుడూ తలంబ్రాలు పోసుకుంటు న్నారు కాబోలు హడావిడి, మాటలు, నవ్వుల పువ్వులు రువ్వుతున్నారు. ఒకటే సందడి సందడిగావుంది. ఆ కోలాహలానికి దూరంగా, తోటలో మసక మసక చీకటిలో, మల్లెతోట వెనకాతల వాళ్ళకి మనసైనది దొరికింది!

## ఎ ఫెక్ట్

చీకటి చెక్కిలిపై
వేకువ సూరీడు
ఛెళ్లున చరిచినట్లుంది
అంతే!
భళ్లున తెల్లవారింది.

— జానీ